తెలుగు దినపత్రిక

ప్రభాత jayabheridaily.com

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 01
సంచిక : 92
పేజీలు : 4
వెల : 4

మల్కాజిగిరి

ఆదివారం, 15-10-2023




విలేకర్లు కావలెను

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్ లో నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు.. కథనాలు... ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా ? మీ కలాలకు పదును పెట్టండి....

ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com

9391 544 889 call me

## ప్రవల్లిక ఆత్మహత్య ల కొత్త మలుపులు

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14

హైదరాబాద్‌లో గ్రూప్ 2కి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి మృతి అర్థరాత్రి కలకలం రేగింది. పరీక్ష వాయిదా పడటం వల్లే ఆమె మృతి చెందిందని గ్రూప్ 2 అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం స్పందించే వరకు మృతదేహాన్ని కదలనివ్వబోమని భీష్మించారు. అయితే పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. చిక్కడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక ఆత్మహత్య చేసుకుంది. స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటూ కాంపిటేషన్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతోంది. శుక్రవారం సాయంత్రం హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడటంతోనే ప్రవళిక ఆత్మహత్య చేసుకుందనితోటి అభ్యర్థులు, అక్కడే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. స్థానికులు, హాస్టల్ సిబ్బంది సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని తరలించేందుకు ప్రయత్నించారు. భారీగా చేరుకున్న అభ్యర్థులు పోలీసులు ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అభ్యర్థులు అడ్డుకోవడంతో అర్థరాత్రి వరకు హాస్టల్‌లోనే మృతదేహం ఉండిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ లీడర్లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీజేపీ సీనియర్ లీడర్ లక్ష్మణ్, బండారు విజయలక్ష్మి నిరసనల్లో పాల్గొన్నారు. రాత్రి రెండు గంటల వరకు ఈ హైడ్రామా కొనసాగింది. ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రూప్స్ అభ్యర్థులు నినాదాలు చేశారు. ఆమెకు న్యాయం చేసే వరకు అక్కడే ఉంటామని భీష్మించారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఆందోళనకారులతో పోలీసులు మాట్లాడుతూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వాళ్లు వెనక్కి తగ్గలేదు.పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. నిరసనకారులను చెదరగొట్టారు. ప్రతిగా ఆందోళనకారులు పోలీసులపైకి

మిగతా 2 లో




# బీ ఫాం.. డౌటే..?

2 లో

తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. సీఈసీ విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. నవంబర్ 30న ఒకే విడతలో 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ 3న కౌంటింగ్ నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కౌంట్ డౌన్ మొదలైంది. రాష్ట్రంలో ఎన్నికల హడావిడి జోరందుకుంది. ఎన్నికల షెడ్యూలుతో సంబంధం లేకుండా చాలా కాలంగా ఎన్నికల అగ్నిగుండలో రగులుతున్న రాష్ట్ర రాజకీయం,షెడ్యూలు విడుదలతో మరింత వేడెక్కింది. అన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు మూడూ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ముఖ్యంగా, ముచ్చటగా మూడవసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలనే లక్ష్యంతో, వ్యూహాత్మకంగా, ముందుగానే, అభ్యర్థులను ప్రకటించి, ప్రత్యర్థులకు సవాలు విసిరారు. మొత్తం 119 నియోజక వర్గాలకు గాను, 115 నియోజక వర్గాలకు గతంలోనే అభ్యర్థులను ప్రకటించారు. అందులోనూ ఎవరూ ఊహించని విధంగా, కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన డజను మంది ఎమ్మెల్యేలతో పాటుగా, 108 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరిగి టికెట్ ఇచ్చారు. అయితే, ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫారం ఇస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో కొత్త చర్చ తెరపై కొచ్చింది. టికెట్లు ఇచ్చిన వారందరికీ, బీ ఫారం ఇస్తారా? లేదా ..? అనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లోనే బలంగా సాగుతోంది.



## చంద్రన్నా.. ఇదేమన్నా..

జయభేరి, విజయవాడ, అక్టోబరు 14 :

చంద్రబాబు రాజకీయ జీవితంలో అత్యంత గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన వ్యక్తిగా, దార్శనికుడిగా మీడియా కీర్తించిన నాయకుడు ఇప్పుడు జైలు గోడలకు పరిమితం అయ్యాడు. ఏ బీజేపీనైతే తిట్టిపోశారో అదే పార్టీని ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. రాజకీయాల్లో గెలుపోటములు, ఎత్తుపల్లాలు సహజమే. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మాత్రం నాలుగు దశాబ్దాలుగా ఎన్నికల్లో ఓటమి అన్నది ఎరుగలేదు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో టీడీపీ ఆవిర్భావ సమయంలో మాత్రమే బాబు ఓటమి పాలయ్యారు. ఆ పార్టీలోకి వచ్చిన తర్వాత ఆయన మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ఎన్టీఆర్ నుంచి ఆ పార్టీని చేజిక్కించుకున్న తర్వాత ఎదురు లేకుండా పోయింది. దేశంలో సంకీర్ణ రాజకీయాల శకం ప్రారంభమైన తర్వాత చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఓ వెలుగు వెలిగారు. దేశంలో ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, స్పీకర్లను నియమించడంలో ప్రభావశీలంగా వ్యవహరించారు. ఆయన రాజకీయ చతురత సంగతెలా ఉన్నా సమయానుకూలంగా కూటములతో జట్టు కట్టడంలో తిరుగులేని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఏ కూటమి బలంగా ఉందో ముందే అంచనా వేసి దానిని తానే సమన్వయం చేయడంలో చంద్రబాబు వ్యూహ చతురత అద్దం పడుతుంది.అలాంటి చంద్రబాబుకు ఇప్పుడు రాజకీయంగా గడ్డు కాలం నడుస్తోంది. స్కిల్

మిగతా 2 లో

## ఆసక్తికరంగా టీమిండియా.. పాకిస్థాన్ మధ్య వరల్డ్ కప్ సమరం



జయభేరి, అహ్మదాబాద్ :

అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో టీమిండియా, పాకిస్థాన్ మధ్య వరల్డ్ కప్ సమరం ఆసక్తికరంగా జరుగుతోంది. టాస్ గెలిచిన టీమిండియా సారథి రోహిత్ శర్మ బౌలింగ్ ఎంచుకున్నాడు. మొదట్లో భారత బౌలర్లకు పిచ్ నుంచి పెద్దగా సహకారం లభించలేదు. మిడిల్ ఓవర్ల వరకు పాకిస్థాన్ బ్యాట్స్ మెన్ పెద్దగా ఇబ్బంది పడకుండానే స్కోరుబోర్డును నడిపించారు. ఇన్నింగ్స్ ఎలా సాగిందంటే... సిరాజ్... పాక్ ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ ను అవుట్ చేసి తొలి వికెట్ పడగొట్టాడు. షఫీక్ 24 బంతుల్లో 20 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ 36 పరుగులు చేసి రెండో వికెట్ రూపంలో వెనుదిరిగాడు. ఈ వికెట్ హార్దిక్ పాండ్యాకు దక్కింది. అప్పటికి జట్టు స్కోరు 12.3 ఓవర్లలో 73 పరుగులు. అక్కడ్నించి కెప్టెన్ బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్ జోడీ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డును పరుగులు తీయించింది. అయితే, మరోసారి సిరాజ్ కీలక వికెట్ తీసి టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. సరిగ్గా 50 పరుగులు చేసి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న బాబర్ అజామ్ ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. సిరాజ్ విసిరిన బంతిని కట్ చేయబోయిన బాబర్ ఆ ప్రయత్నంలో విఫలమై అవుటయ్యాడు. అక్కడ్నించి స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తిప్పేశాడు. మొదట సాద్ షకీల్ ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఆ తర్వాత హార్డ్ హిట్టర్ ఇఫ్తికార్ అహ్మద్ ను బౌల్డ్ చేశాడు. దాంతో పాక్ శిబిరంలో నిశ్శబ్దం అలముకుంది. ఏం జరుగుతోందో తెలుసుకునే లోపే 5 వికెట్లు పడిపోయాయి. అది చాలదన్నట్టుట.. సెకండ్ స్పెల్ లో బంతిని అందుకున్న బుమ్రా... అప్పటికే క్రీజులో కుదురుకున్న మహ్మద్ రిజ్వాన్ (49) ను బౌల్డ్ చేయడంతో పాక్ ఆరో వికెట్ కోల్పోయింది.ప్రస్తుతం పాకిస్థాన్ స్కోరు 34 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు కాగా... క్రీజులో నవాజ్ ( 0 బ్యాటింగ్), షాదాబ్ ఖాన్ (1 బ్యాటింగ్) ఉన్నారు.



## హమాస్ సాయుధుల చెరలో చిన్నారుల వీడియోను ప్రజెంట్

జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబర్ 14

హమాస్సాయుధులు ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఇజ్రాయిల్ ప్రజల్ని బంధీ చేసిన ఆ వ్యక్తులు.. వారి చెరలో ఉన్న చిన్నారుల వీడియోను ప్రజెంట్ చేశారు. టెలిగ్రాం యాప్‌లో ఆ వీడియోను పోస్టు చేశారు. తమ వద్ద ఉన్న పిల్లల్ని బాగానే చూసుకుంటున్నామన్న సందేశాన్ని ఇచ్చేందుకు గాజా స్ట్రిప్‌లో ఉన్న సాయుధులు ఈ వీడియోను రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది. ఓ చిన్నారిని తోపుడు బండిలో ఉంచి ఆడిస్తున్నారు. మరో చిన్నారిని చేతుల్లో ఎత్తుకుని తిప్పుతున్నారు. హమాస్ ఉగ్రవాదులు తమ చేతుల్లో ఏకే రైఫిళ్లను పట్టుకునే.. పిల్లల్ని ఆడిస్తున్న వీడియో ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. మిలిటరీ దుస్తులతో ఏకే సిరీస్ రైఫిల్‌తో ఉన్న ఓ వ్యక్తి తన భుజాలపై ఓ చిన్నారిని ఎత్తుకున్నాడు. ఇక తోపుడు బండిలో ఏడుస్తున్న మరో చిన్నారిని బుజ్జగించేందుకు ఓ సాయుధుడు ప్రయత్నించాడు. పిల్లలతోటి బిస్మిల్లా అనిపిస్తూ వాళ్లకు నీళ్లు తాగిస్తున్నారు. మరో వైపు ఇజ్రాయిల్ మాత్రం గ్రౌండ్ ఆపరేషన్ మొదలుపెట్టింది. గాజా నుంచి హమాస్‌ను తరిమేందుకు పూర్తి స్థాయిలో యుద్ధానికి దిగింది స్‌ను తరిమేందుకు పూర్తి స్థాయిలో యుద్ధానికి దిగింది.


## బీసీలకు 50 సీట్లు..?



జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14 :

వచ్చే ఎన్నికల్లో బీసీల ఓట్లను రాబట్టుకోవడంపై బీజేపీ దృష్టి సారిస్తోంది. దాదాపు 48 సీట్లను బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని సంచలన నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఇటీవల రాష్ట్ర నేతలకు క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. బీజేపీ అంటేనే బీసీల పార్టీ అని, అందుకే బీసీ మార్క్ తో ఎన్నికలకు వెళ్లాలని చూస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ బీసీలకు ఇవ్వనన్ని సీట్లు కమలం పార్టీ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అందులో ముదిరాజ్ కులస్తులకే కనీసం ఐదుకు తగ్గకుండా సీట్లు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ఇతర కులాల వారికీ ప్రాధాన్యం

మిగతా 2 లో



## ఫోర్బ్స్ మ్యాగజైన్ లో ఇండియాలోనే రిచెస్ట్ పర్సన్ హోదా

జయభేరి, ముంబై, అక్టోబరు 14 :

ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకారం, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ, ఇండియాలోనే రిచెస్ట్ పర్సన్ హోదా అనుభవిస్తున్నారు. $92 బిలియన్ల నెట్ వర్త్‌తో భారతదేశంలో అత్యంత సంపన్న వ్యక్తిగా తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు. అంబానీ వ్యక్తిగత సంపద ఈ సంవత్సరం $4 బిలియన్లు పెరిగింది.ఫోర్బ్స్ మ్యాగజైన్, 2023లో భారతదేశంలోని 100 మంది ధనవంతుల జాబితాను తయారు చేసింది. అదానీ గ్రూప్

మిగతా 2 లో

## ఇంకా కొలిక్కిరాని కాంగ్రెస్ జాబితా



జయభేరి, న్యూఢిల్లీ

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక కసరత్తు ఇంకా పూర్తిగా కొలిక్కి రాలేదు. శుక్రవారం ఉదయం గం. 11.00 సమయంలో స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ కే. మురళీధరన్ అధ్యక్షతన సమావేశమైంది. ఈ భేటీలో కమిటీ సభ్యులు బాబా సిద్దిఖీ, ఏఐసిసి కార్యదర్శులు సీనీ విష్ణుదాస్, మన్సూర్ అలీ ఖాన్, రోహిత్ చౌదరి, టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి, పార్టీ తెలంగాణ ఇన్ ఛార్జ్ మాణిక్ రావు ఠాక్రే,ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కి తదితరులు పాల్గొన్నారు. 70 స్థానాలకు అభ్యర్థులు ఖరారయినట్లు సమాచారం. సోమ, మంగళవారాల్లో ఏదో ఒకరోజు సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మరోసారి సమావేశమై మిగతా 49 స్థానాల కసరత్తు పూర్తి చేస్తుందని పార్టీ నేతలు అంటున్ఆరు. మొత్తం కసరత్తు పూర్తి చేసిన తర్వాత ఒకేసారి 119 స్థానాలకు జాబితాను విడుదల చేసేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రవల్లిక ఆత్మహత్య ల కొత్త మలుపులు

రాళ్లు రువ్వారు. ఇలా టెన్షన్ వాతావరణంలోనే ప్రవళిక మృతదేహాన్ని పోలీసులు తరలించారు. గాంధీ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రవళిక పేరు మీద ఓ సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో తిరుగుతోంది. అమ్మా నన్ను క్షమించండి అంటూ మొదలు పెట్టిన లేఖలో చాలా అంశాలు ప్రస్తావించింది. తాను నష్టజాతకురాలిని అని తన వల్ల పేరెంట్స్‌కు ఎప్పుడూ బాధలే అని చెప్పుకొచ్చింది. మీకు నేను చాలా అన్యాయం చేశానని ఎవరూ ఏడవొద్దని చెప్పిన ప్రవళిక..తన కాళ్లు కిందపెట్టకుండా చూసుకున్న అమ్మకు ధన్యవాదాలు చెప్పింది. అమ్మకోసం ఏం చేయలేకపోతున్నానని క్షమించాలని కోరుతూ లేఖ ముగించింది. ఉదయాన్నే ప్రవళిక బంధువులు హైదరాబాద్ వచ్చారు. గాంధీ ఆసుపత్రిలో ఆమె మృతదేహాన్ని చూసిన తల్లి కుప్పకూలిపోయారు. మెను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకొని తలెత్తుకొని వస్తుందని అనుకుంటే ఇలా విగత జీవిగా పడి ఉండటం చూసి బంధువులు కూడా తట్టుకోలేకపోయారు.

**రాజకీయ మలుపులు**

హైదరాబాద్‌లో గ్రూప్ 2 కోసం ప్రిపేర్ అవుతున్న ప్రవళిక ఆత్మహత్య రాజకీయ మలుపు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల వేళ యువతి మరణంపై రాజకీయ పార్టీలు ఘాటుగా స్పందిస్తున్నాయి. అటు నిరుద్యోగుల్లోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రవళిక శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. ప్రవళికది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి. డిగ్రీ పూర్తి చేసిన ప్రవళిక రెండు సంవత్సరాలుగా హైదరాబాద్‌లోని ఉంటూ కోచింగ్ తీసుకుంటోంది. గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడడంతో మనస్తాపానికి గురైన ప్రవళిక హాస్టల్ రూంలో సూసైడ్ చేసుకున్నట్లు స్నేహితులు, బంధువులు చెబుతున్నారు. ఆమె పేరు మీద సూసైడ్ నోట్ కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రాత్రి హైడ్రామా మధ్య ప్రవళిక మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రాత్రికి రాత్రే పోస్టుమార్టం పూర్తి చేశారు. వెంటనే స్వగ్రామానికి ప్రవళిక డెడ్‌బాడీని తీసుకొచ్చారు. పోలీస్ బందోబస్తు మధ్య స్వగ్రామం బిక్కాజిపల్లికి మృతదేహం చేరుకుంది. ప్రవళిక మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇది ప్రభుత్వ హత్యగా విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రవళిక ఆత్మహత్య విషయం తెలుసుకున్న బీజేపీ, కాంగ్రెస్ లీడర్లు రాత్రి అశోక్‌నగర్ చేరుకున్నారు. బీజేపీ సీనియర్ నేత లక్ష్మణ్‌సహా ఇతరులు ధర్నాకు దిగారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రవళిక మృతదేహం తరలింపును అడ్డుకుంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు మెరుపు ధర్నాకు దిగారు. ఒక్కసారిగా ఆందోళనకారులు రోడ్డుపైకి రావడంతో చిక్కడపల్లి పరిసరాల్లో పూర్తిగా ట్రాఫిక్ జామ్ అయిపోయింది. పరిస్థితి చేయిదాటిపోవడంతో రాజకీయనాయకులను బలవంతంగా పోలీసులు వాహనాల్లో తరలించారు. ధర్నా చేస్తున్న అభ్యర్థులపై లాఠీఛార్జ్ చేశారు. మాట వినని వారిని ఈడ్చి పడేశారు. బలవంతంగా అభ్యర్థులను అక్కడి నుంచి తరలించి ప్రవళిక మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ప్రభుత్వం, పోలీసుల తీరుపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్ధరాత్రి జరిగిన హైడ్రామా విజువల్స్ వైరల్‌గా మారాయి. తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రవళిక మరణంపై రాజకీయాల తో చెలగాటం ఆడుతున్నారని బీజేపీ, కాంగ్రెస్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అంటూ బీఆర్ఎస్ తన ఎక్స్ అకౌంట్‌లో విమర్శలు చేసింది. మొన్నటి వరకు గ్రూప్ 2ను వాయిదా వేయాలని డిమాండ్ చేసిన వీళ్లే ఇప్పుడు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించింది. ఉన్మాద్ జాగ్రత్త ఇలాంటి నీచ రాజకీయ నాయకుల కుట్రలకు, కుతంత్రాలకు బలి కావొద్దని తెలంగాణ యువతకు సూచనలు చేసింది పార్టీ.

## ఇండియాలోనే రిచెస్ట్ పర్సన్ హోదా

అధినేత & బిలియనీర్ గౌతమ్ అదానీ, 2022లో మొదటిసారిగా అంబానీని ఓవర్‌టేక్ చేసి భారతదేశపు అత్యంత సంపన్నుడిగా నిలిచారు. ఈ ఏడాది జనవరిలో, US షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలతో అదానీ నికర విలువ $82 బిలియన్లకు పడిపోయింది. ప్రస్తుతం, $68 బిలియన్ల ఆస్తులతో రెండో అత్యంత సంపన్న భారతీయుడిగా ఉన్నారు. HCL టెక్ వ్యవస్థాపకుడు, సాఫ్ట్‌వేర్ వ్యాపారవేత్త శివ్ నాడార్ 2023 జాబితాలో $29.3 బిలియన్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. టెక్ సర్వీసులకు మళ్లీ డిమాండ్ పెరగడంతో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు 42 శాతం పెరిగాయి, అతను రెండు స్థానాలు పైకి జంప్ చేశారు. ఫోర్బ్స్ ప్రకారం, ఏడాదిలో ఆయన శివ్ నాడార్ సంపద $7.9 బిలియన్లు పెరిగింది. ఈ మొత్తం లిస్ట్‌లోని మరెవరి ఆస్తులు ఈ స్థాయిలో పెరగలేదు.పవర్ & స్టీల్ కంపెనీల జిందాల్ గ్రూప్‌నకు చెందిన సావిత్రి జిందాల్, $24 బిలియన్లతో నాలుగో ర్యాంక్ సాధించారు. దేశంలోని మహిళా పారిశ్రామికవేత్తల్లో అత్యంత ధనవంతురాలైన సావిత్రి జిందాల్, ఓవరాల్ లిస్ట్‌లో టాప్5లో అడుగు పెట్టడం విశేషం. అవెన్యూ సూపర్‌మార్ట్స్ ఓనర్ రాధాకిషన్ దమానీ $23 బిలియన్ల సంపదతో ఐదో ప్లేస్‌లో ఉన్నారు. దమానీ వ్యక్తిగత సంపద $27.6 బిలియన్ల నుంచి $23 బిలియన్లకు తగ్గింది.

**టాప్ 6 10 స్థానాల్లో ఉన్న సంపన్న భారతీయులు**

6. సైరస్ పూనావాలా: $20.7 బిలియన్లు
7. హిందూజా ఫ్యామిలీ: $20 బిలియన్లు
8. దిలీప్ సంఘ్వి: $19 బిలియన్లు
9. కుమార్ బిర్లా: $17.5 బిలియన్లు
10. షాపూర్ మిస్త్రీ & ఫ్యామిలీ: $16.9 బిలియన్లు

వ్యక్తిగత సంపద కనీసం $2.3 బిలియన్లు ఉన్నవారిని టాప్ 100 బిలియనీర్స్ ఎలైట్ క్లబ్‌లోకి ఫోర్బ్స్ మ్యాగజైన్ తీసుకుంది. 2023లో భారత్‌లో రికార్డు స్థాయిలో 169 బిలియనీర్లు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఈ జాబితాలో అయిదుగురు ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే, మన దేశంలో తొలి 100 మంది సంపన్నుల మొత్తం సంపద పెద్దగా మారలేదని ఫోర్బ్స్ వెల్లడించింది. వీళ్ల టోటల్ వెల్త్ 2023లో $799 బిలియన్ల వద్ద ఉండగా, 2022లో ఇది $800 బిలియన్లుగా ఉంది.ప్రపంచంలోనే అత్యధిక బిలియనీర్స్ ఉన్నదేశం అమెరికా. ఫోర్బ్స్ ఏప్రిల్‌లో రిలీజ్ చేసిన వరల్డ్ బిలీనియర్స్ లిస్ట్‌లో 735 మంది అమెరికన్లు ఉన్నారు, వారి మొత్తం విలువ $4.5 ట్రిలియన్లు. చైనా (హాంకాంగ్ & మకావుతో కలిపి) సెకండ్ ప్లేస్‌లో ఉంది, 2 ట్రిలియన్ డాలర్ల విలువైన 562 బిలియనీర్లు అక్కడ నివశిస్తున్నారు. భారతదేశం ఆ తర్వాతి స్థానంలో ఉంది.2022లో ఆర్థిక ప్రతికూలతలు ఎదుర్కొన్న తర్వాత, ప్రపంచ సంపద 2023లో దాదాపు 5 శాతం పుంజుకుని 267 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సెప్టెంబర్ రిపోర్ట్‌లో తెలిపింది.

## బీసీలకు 50 సీట్లు..?

ఇస్తూ టికెట్లు కేటాయించాలని భావిస్తోంది.తెలంగాణలో కాంగ్రెస్ రెడ్ల పార్టీగా, బీఆర్ఎస్ వెలమ, రెడ్ల పార్టీగా ముద్ర పడిన నేపథ్యంలో ఆ రెండు పార్టీలను దెబ్బకొట్టేలా బీసీ కార్డుతో బీజేపీ భారీ స్కెచ్ వేసుకుంది. వారికి బీసీ ఓటు బ్యాంకును దూరం చేసేలా ప్లాన్ చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే 115 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించగా అందులో 23 మంది బీసీలకు అవకాశం కల్పించారు. కాగా, బీసీ సామాజికవర్గంలో మొత్తం 136 కులాలుండగా అందులో కేవలం యాదవ, గౌడ, మున్నూరుకాపు, పద్మశాలి, గంగపుత్ర, వంజరి కులస్తులకు మాత్రమే టికెట్లు కేటాయించింది. అత్యధిక శాతం జనాభా ఉన్న ముదిరాజ్ లకు ఒక్కటంటే ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. దీనిపై ఆ సామాజికవర్గం నేతలు గుర్రుగా ఉన్నారు. పలువురు బీఆర్ఎస్ ను వీడేందుకు సైతం సిద్ధమవుతున్నారు. దీంతో వారిని చేర్చుకోవడంపై బీజేపీ కసరత్తును ముమ్మరం చేసింది. మరోవైపు కాంగ్రెస్ ఇప్పటివరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు. రేపో మాపో ప్రకటించే అవకాశం ఉంది. ఆ పార్టీ మహా అయితే 25 నుంచి 30 సీట్లు బీసీలకు ఇచ్చే అవకాశముందన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఆ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తే బహుజనవాదాన్ని వినిపించిన వారిమవుతామని భావిస్తోంది. గతంలో కాషాయ పార్టీకి బ్రాహ్మణులు, ఆర్యవైశ్యుల పార్టీగా ముద్ర పడింది. కానీ మోడీ ప్రధాని అయ్యాక ఆ సీన్ మారింది. ఆయన బీసీ కావడంతో బీసీల పార్టీగా బీజేపీకి ముద్ర పడింది. బీసీలకు కేంద్రమంత్రి పదవులు దక్కడంతో అగ్ర కులాల పార్టీ అన్న ముద్ర క్రమంగా తగ్గింది. అందుకే బీసీలకు కనీసం 40కి తక్కువ కాకుండా, దాదాపు 48 సీట్ల వరకు ఉండాలని నిర్ణయం తీసుకుందని చర్చ జరుగుతోంది. ఈమేరకు బీఎల్ సంతోష్ సైతం నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే లిస్టును సిద్ధం చేయాలని రాష్ట్ర నాయకత్వానికి సూచనలు చేసినట్లు సమాచారం.తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలకు గాను ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు 19, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు 12 ఉన్నాయి. అవి పోగా మిగతా 88 సీట్లలో సగం కంటే ఎక్కువ సీట్లను బీసీలకు కేటాయించాలని బీజేపీ చూస్తోంది.

# బీ ఫాం.. డౌటే..?

✍ **జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14 :**

లంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. సీఈసీ విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. నవంబర్ 30న ఒకే విడతలో 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ 3న కౌంటింగ్ నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కౌంట్ డౌన్ మొదలైంది. రాష్ట్రంలో ఎన్నికల హడావిడి జోరందుకుంది.ఎన్నికల షెడ్యూలుతో సంబంధం లేకుండా చాలా కాలంగా ఎన్నికల అగ్నిగుండలో రగులుతున్న రాష్ట్ర రాజకీయం, షెడ్యూలు విడుదలతో మరింత వేడెక్కింది. అన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు మూడూ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ముఖ్యంగా, ముచ్చటగా మూడవసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలనే లక్ష్యంతో, వ్యూహాత్మకంగా, ముందుగానే, అభ్యర్ధులను ప్రకటించి, ప్రత్యర్ధులకు సవాలు విసిరారు. మొత్తం 119 నియోజక వర్గాలకు గాను, 115 నియోజక వర్గాలకు గతంలోనే అభ్యర్ధులను ప్రకటించారు. అందులోనూ ఎవరూ ఊహించని విధంగా, కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన డజను మంది ఎమ్మెల్యేలతో పాటుగా, 108 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరిగి టికెట్ ఇచ్చారు. అయితే, ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్ధులకు బీ ఫారం ఇస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో కొత్త చర్చ తెరపై కొచ్చింది. టికెట్లు ఇచ్చిన వారందరికీ, బీ ఫారం ఇస్తారా? లేదా ..? అనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లోనే బలంగా సాగుతోంది. అభ్యర్ధుల ప్రకటన తర్వాత ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఒక్కసారిగా సైలెంటై పోయారు. సైలెంట్ గా ఇంటర్నల్ వ్యవహారాలు చక్క బెడుతున్నారు. అందులో భాగంగా ఏ రోజుకా రోజు వార్ రూమ్ కు వస్తున్న సమాచారం,



ఫ్రెష్ సర్వే రిపోర్టుల ఆధారంగా, ఇతర అంశాలతో పాటుగా అభ్యర్ధులను మార్చే విషయంలోనూ సీరియస్ కసరత్తు జరుగుతోందని, అంటున్నారు. టికెట్ ఇచ్చిన వారందరికీ బీ ఫారం ఇస్తారా, లేక ..కొందరికి మొండి చేయి చూపుతారా అనే విషయంలో పార్టీ వర్గాల్లో తెగ టెన్షన్ నెలకొంది. ముఖ్యంగా ఇప్పటికే ఎన్నికల పనుల్లో తలమునకలైన అభ్యర్ధులకు బీ ఫారం బెంగ పట్టుకుందని అంటున్నారు. నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనూహ్యంగా ఒకేసారి సారి 115 నియోజక వర్గాలకు అభ్యర్ధులను ప్రకటించడంతో పాటుగా, కొద్ది మంది మినహా మిగిలిన సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్ ఇచ్చి రైట్ చెప్పినప్పుడే చాలా మంది అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. అప్పటికే టికెట్ వస్తుందో రాదో అన్న అనుమానంతో పక్క చూపులు చూస్తున్న వారిని కట్టడి చేసేందుకే కేసీఆర్ గంపగుత్తగా ఆల్మోస్ట్ అందరికీ టికెట్ ఇచారు కానీ . టికెట్ ఇచ్చిన అందరికీ బీ ఫారం గ్యారెంటీ లేదనే ప్రచారం అప్పట్లోనే జరిగింది. అయితే అప్పట్లో స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఒకటి అరా మినహా పెద్దగా మార్పులు ఉండవని చెప్పారు. అయితే తాజా సర్వేలు, ముఖ్యమంత్రి కేసీఅర్ నెల రోజులకు పైగా సాగిస్తున్న అంతర్గత మథనం నేపథ్యంలో పునరాలోచనలో పడ్డారని అంటున్నారు. ప్రభుత వ్యతిరేకత ఉండనే ఉంది. అంతకంటే ఎక్కువగా సగం మందికి పైగా సిట్టింగుల పట్ల తీవ్ర వ్యతిరేకత ఆయా నియోజకవర్గాలలో ఉందని తేలడంతో అలా వ్యతిరేకత ఎదుర్కొంటున్న సగం మంది సిట్టిగిలకు బీ ఫారం ఇవ్వక పోవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సమయంలో కేసీఆర్ అంత సాహసం చేస్తారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా ఆదివారం బీఫాంలు ఇచ్చిన తరువాత బీఆర్ఎస్ లో అసమ్మతి జ్వాలలు మరోసారి భగ్గుమనడం ఖాయమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# మన చేతుల్లోనే దాగి ఉన్న ఆరోగ్యం

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ

✍ **జయభేరి, హైదరాబాద్ అక్టోబర్ 14**

చేతుల అపరిశుభ్రత ప్రాణాల మీద తెస్తుందని, డయేరియా, న్యూమోనియా లాంటి వ్యాధులతో ఎంతోమంది చిన్నారులు కన్నుమూస్తున్నారని, సరైన అవగాహన చైతన్యం లేకపోవడం వల్ల, తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని, చిన్న చిన్న జాగ్రత్తలతో వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకునే విసులుబాటు ఉన్నప్పటికీ నిర్లక్ష్యము కారణంగా పరిస్థితిని చేజారి పోతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ అన్నారు. అన్నం తినబోయే ముందు, మరుగుదొడ్లు వాడిని అనంతరము, బయటనుంచి ఇంట్లోకి వచ్చిన తర్వాత, చేతుల శుభ్రత విషయంలో నిర్లక్ష్యము చేస్తున్నారని, దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, రకరకాల ప్రమాదకర వ్యాధులను కేవలం చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దూరంగా పెట్టవచ్చు అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ అన్నారు. ఈ సందర్భంగా లిల్లీ మేరీ మాట్లాడుతూ ఈ అలవాటును పాటించడం ద్వారా ఏటా 50 లక్షల మరణాలు తగ్గించవచ్చు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని, అందరూ చేతిశ్రభత పై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని ఆదివారం ప్రపంచ చేతి శుభ్రత దినోత్సవ సందర్భంగా భిన్న అంశాలతో ప్రత్యేక కథనం.

**చిన్నపిల్లలతో తస్మాత్ జాగ్రత్త:**

పిల్లల్లో న్యూమోనియా, ఇతర శ్వాసకోశ వ్యాధులకు ప్రధాన కారణం శుభ్రత పాటించకపోవడం, నెలలు నిండని శిశువులు, అప్పుడే పుట్టిన పిల్లలను తాకేముందు తల్లిదండ్రులు ఇతరులు తప్పనిసరిగా శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా చేతులను సబ్బుతో కడుక్కన తర్వాతే శిశువులను తాకాలి. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అవయవ మార్పిడి చేసుకున్న వారిలో మిగతా వారితో పోలిస్తే వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటివా



రు శుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే తేలికగా వ్యాధులు దాడి చేసేందుకు అవకాశం ఇచ్చినట్టే. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా 25% వరకు న్యూమోనియా ఇతర శ్వాసకోశ వ్యాధులను నివారించవచ్చని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ పేర్కొన్నారు.

**ఆషామాషీగా వద్దు:**

అత్యధికులు చేతి శుభ్రతను ఆషామాషీగా తీసుకుంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి . కేవలం నీటితో కాకుండా సబ్బు, లేదంటే యాంటీ బ్యాక్టీరియల్ లోషన్ ఉపయోగించాలని సూచిస్తున్నారు. నగరంలో 100% ఇళ్లలో సబ్బు వినియోగంలో ఉంది. స్నానానికి, దుస్తులు ఉతకడానికి, వంటపాత్రలో కడగటానికి వాడుతున్నారు. పాత్రలు కడగటానికి సాధారణంగా 30% కంటే తక్కువ మంది మాత్రమే చేతులను కడుక్కునేందుకు సబ్బు లేదా యాంటీ బ్యాక్టీరియాల్ ఉత్పత్తులు వాడుతున్నారని లిల్లీ మేరీ అన్నారు. మరుగుదొడ్లు ఉపయోగించాక సబ్బుతో చేయి కడుక్కొని ఫలితంగా వైరల్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ గురవుతున్నారని, ఒకరికి సోకితే మిగతా కుటుంబ సభ్యులకు అది వ్యాపిస్తుందని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ పేర్కొన్నారు.

**వ్యాధులకు హేతువు:**

మన చెయ్యి ఎన్నో బ్యాక్టీరియా, వైరస్లకు నిలయం. నిత్యం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతుంటాము. రకరకాల వస్తువులను తాకుతుంటాము. మరుగు దొడ్లను వినియోగిస్తుంటాము. ఈ క్రమంలో అనేక రకాల బ్యాక్టీరియా, వైరస్లు, చేతి వేళ్ళు, ముంచేయి గోళ్ళలో, నివాసమును ఏర్పాటు చేసుకుంటాయి. ఎప్పటికప్పుడు సబ్బు లేదా యాంటీ బ్యాక్టీరియా లోషన్ తో శుభ్రం చేసుకోవాలి. అలా కాకుండా అవే చేతులతో నోరు, కళ్ళు, ముక్కు, పెదవులను తాకటం వల్ల వ్యాధుల సోకే ప్రమాదం ఉంది. ప్రధానంగా వ్యక్తిగత శుభ్రత పాటించనందునే డయేరియా, న్యూమోనియా, టైఫాయిడ్ కలరా స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు నగరంలో పెరుగుతున్నాయి. వైరస్ బ్యాక్టీరియా క్రిములు ఇందుకు కారకాలు. ఒకరి నుంచి వేరొకరికి వేగంగా ఇవి విస్తరిస్తాయి. స్వైన్ ఫ్లూ తో బాధపడే వారు తుమ్మినా, దగిన ఆ వైరస్ సమీపంలో ఉండే వస్తువుల పైకి చేరుతుంది. అక్కడ చేతులు వేసిన సమయంలో శరీరంలోకి చేరుతుంది. ఇక ఆహారం తినడానికి ముందు, వడ్డించేటప్పుడు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే చేతిలో వైరస్ ఉంటే ఆహార పదార్థాల మీద వ్యాపించి, అతిసారము లాంటి అనారోగ్యసమస్యలకు దారితీస్తుంది.

**ఇవి వాడాలి:**

ఈ సందర్భంగా లిల్లీ మేరీ మాట్లాడుతూ చేతుల శుభ్రతకు నీళ్లు, సబ్బు, శానిటైజర్ల వాడకంతో బ్యాక్టీరియా క్రిములను 60 శాతం వరకు తొలగించే అవకాశం ఉంది. అలాగే రసాయనాలు ఎక్కువగా లేని సభ్యులు వినియోగించి చేతులు కడుక్కోవడం మంచిది. సున్నిపిండి, పసుపు, వేడి నీళ్లు, నిమ్మకాయ రసం మిశ్రమము, కలబంద, తేయాకు, పొద్దుతిరుగుడు నూనెలతో తయారైన శానిటైజర్లు వాడితే చాలా మంచిదని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ తెలిపారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## చంద్రన్నా.. ఇదేమన్నా..

డెవలప్‌మెంట్ కేసులో జైలకు వెళ్లి నెలరోజులు దాటింది. మరో మూడు కేసులు బాబును వెంటాడుతున్నాయి. ఫైబర్ గ్రిడ్ కేసులో బాబు సిఐడి కస్టడీ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు అనుమతించింది. అంటే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు ఉన్నత కోర్టులో ఊరట లభించినా దాని ప్రభావం పెద్దగా ఉండదు.చంద్రబాబును వీలైనంత కాలం జైల్లో ఉంచాలన్న ప్రత్యర్థుల వ్యూహాలు పక్కాగా అమలవుతున్నాయి. ఇందులో ఎవరు అంతిమంగా విజేతగా నిలుస్తారనే దానికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఏసీబీ కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు పీటముళ్లు బిగుసుకుంటున్న తరుణంలో చంద్రబాబు వెనువెంటనే కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటప పడటం కూడా అంత సులువు కాకపోవచ్చు. అరెస్ట్ తర్వాత దాదాపు నెలరోజులుగా ఈ కష్టాల నుంచి బయటపడేసే శక్తుల కోసం తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాజకీయంగా ఒత్తిడి చేయడం ద్వారా సానుకూల ఫలితాల కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ జరుగుతోంది. ఈ క్రమంలో బీజేపీ పెద్దల్ని ఆశ్రయించే ప్రయత్నాలపై విస్తృత ప్రచారం జరిగింది. అయితే అవన్నీ రెండ్రోజుల క్రితమే ఫలించాయి. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరితో పాటు మరికొందరు సొంత సామాజిక వర్గ నేతల ప్రమేయంతో అమిత్ షా అపాయింట్‌మెంట్ లభించింది.ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై బీజేపీ అగ్రనేతలెవరు ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారం పూర్తిగా ఏపీకి సంబంధించిన పరిణామంగానే చూశారు. అటు కాంగ్రెస్ పార్టీ కూడా బాబును పూర్తిగా వదిలేసింది.ఐదేళ్ల క్రితం వరకు బీజేపీకి మిత్రపక్షంగా, ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా ఉన్న టీడీపీ ఆ తర్వాత అవసరానికి మించి ఘర్షణ వైఖరి అవలంబించింది. ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఉద్యమించడానికి రాజీనామాలకు సిద్ధపడిన వైసీపీకి చెక్ పెట్టే క్రమంలో పూర్తిగా ఉచ్చులో చిక్కుకుపోయింది. అంతటితో ఆగకుండా బీజేపీని నానా రకాలుగా విమర్శించింది. ప్రధాని మోదీ, అమిత్‌షాలపై బాబుతో సహా టీడీపీ నేతలు నిప్పులు చెరిగారు. బీజేపీ బలాన్ని ఏ మాత్రం అంచనా వేయకుండానే తొందరపాటుతో వ్యవహరించింది. బీజేపీ పనైపోయిందనే భావనలో కాంగ్రెస్‌తో జత కట్టింది. ఏపీ పర్యటనకు వచ్చిన అమిత్‌షా కాన్వాయ్ మీద రాళ్లు విసిరి, నల్లజెండాలు ఊపి, నిరసన తెలిపారు. ఢిల్లీలో ధర్మ పోరాట దీక్షలు చేసి, మోదీని కుటుంబం బాధ్యతలు లేని మనిషి అంటూ ఎక్కిరించి తొడగొట్టి సవాలు చేశారు.బాబు జైలుకు వెళ్ళిన తర్వాత చివరకు అదే పార్టీని శరణు కోరే పరిస్థితికి వచ్చేశారు. బీజేపీ ప్రభుత్వం చెప్పు చేతల్లో ఉంటుందని సిబిఐకు రాష్ట్రంలో ఎంట్రీ కూడా లేదని ప్రకటించారు. అంతగా వ్యతిరేకించిన బీజేపీనే ఇప్పుడు మళ్లీ బాబు ఆశ్రయించాల్సి వచ్చింది. చంద్రబాబు అనుభవిస్తున్న కష్టాలకు కారణం ఏమిటనే చర్చ కూడా ఇప్పుడు రాజకీయాల్లో చర్చకు వస్తోంది.

# జనగామ బిఆర్ఎస్ టికెట్ పొన్నాలకేనా?

✍ **జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 14**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. నేతలు.. ఆ గట్టు నుంచి ఈ గట్టుకు దాటి పోతున్నారు. తాజాగా కాంగ్రెస్‌లో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ నేత, మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య హస్తానికి గుడ్‌బై చెప్పారు. రాజీనామా చేసి కొన్ని గంటలైనా గడవక ముందే బీఆర్ఎస్ పెద్దలు సంప్రదింపులు జరిపి.. కారెక్కించడానికి ప్రయత్నాలు షురూ చేసింది. మంత్రి కేటీఆర్ స్వయంగా పొన్నాల ఇంటికి వెళ్లి బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు.

**రేవంత్ ఓ దౌర్భాగ్యుడు!**

కేటీఆర్‌తో భేటీ తర్వాత పొన్నాల మీడియాతో మాట్లాడుతూ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఫైరయ్యారు. ''రాజకీయాల్లో పదవులు కోఆర్డినేషన్ కోసం మాత్రమే. రేవంత్ లాంటి దౌర్భాగుడి గురించి నేను మాట్లాడాను. కాంగ్రెస్ పార్టీని రేవంత్ లాంటి వాళ్లు భ్రష్టు పట్టిస్తున్నారు.



రేవంత్ కాంగ్రెస్‌లోకి వచ్చాక అయన ఎమ్మెల్యేగా ఎందుకు గెలవలేదు?, పార్టీలో నేనొక్కడ్నే ఓటమి పాలయ్యానా?, జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ భార్య ఓడిపోలేదా?, అవమానాన్ని భరించలేకే పార్టీని వీడా. బీఆర్ఎస్‌లో చేరాలని కేటీఆర్ నన్ను కోరారు. రేపు సీఎం కేసీఆర్‌ను కలిసిన తర్వాత అన్ని వివరాలు చెప్తా.'' అని పొన్నాల పేర్కొన్నారు.

**బంపరాఫర్ ఇదేనా..?**

ఇదిలా ఉంటే.. జనగామ బీఆర్ఎస్ టికెట్ పొన్నాలకు ఇవ్వొచ్చని ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగానే బీసీ నాయుకుడ్ని కలిసినట్లు పొలిటికల్‌గా చర్చ నడుస్తోంది. పొన్నాల బీసీ నాయకుడు కావడం.. పైగా రాజకీయ అనుభవం కలిగిన నేత అయి ఉండడం బీఆర్ఎస్‌కు కలిసొచ్చే అవకాశంగా భావిస్తోంది. పైగా గత కొద్ది రోజులుగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య సీటు పంచాయితీతో కేడర్ అయోమయానికి గురైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయానికి ఎలాంటి తలనొప్పులు వస్తాయోనని గులాబీ పార్టీ అనుమానిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి గందరగోళం లేకుండా పొన్నాలకు సీటు ఇస్తే బాగుంటుందని బీఆర్ఎస్ ఆలోచన చేస్తోంది. ఇదలా ఉంటే పొన్నాలను బీఆర్ఎస్‌లోకి రావాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆహ్వానించారు. మరి ఏం జరగబోతుందో వేచి చూడాలి.

# ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్



✍ **జయభేరి, హైదరాబాద్ :**

ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఏఎస్. రావు నగర్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి ఆదివారం నాడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నారు. సోమశేఖర్ రెడ్డి గ్రేటర్ లో రేవంత్ రెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉన్నారు. పార్టీలో సీనియర్లకు న్యాయం జరగలేదంటూ సోమశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు

# 48 గంటల్లో నివేదిక ఇవ్వండి

✍ **జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14**

హైదరాబాద్ లో గ్రూప్ 2 అభ్యర్థిని ప్రవళిక ఆత్మహత్యపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర సీఎస్, డీజీపీ, TSPSC కార్యదర్శిని ఆదేశించారు. నిరుద్యోగులు సహనం కోల్పోవద్దని తమిళిసై కోరారు.వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక (23) అశోక్ నగర్ లోని ఓ హాస్టల్ లో ఉంటూ గ్రూప్ 2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. శుక్రవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తోటి విద్యార్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న వందలాది నిరుద్యోగ అభ్యర్థులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపిస్తూ నిరసనలు తెలిపారు. వారికి బీజేపీ నేతలు సైతం మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. ఎట్టకేలకు అర్ధరాత్రి తర్వాత పోలీసులు మృతదేహాన్ని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తైన అనంతరం ప్రవళిక మృతదేహాన్ని అక్కడి నుంచి శనివారం ఉదయం ఆమె స్వగ్రామానికి తరలించారు. ప్రవళిక మృతితో ఆమె స్వగ్రామం బిక్కాజిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# ఎలక్షన్ ఇంచార్జ్ రావులకు పార్టీ శ్రేణుల పరిచయ కార్యక్రమం

జయభేరి, ఉప్పల్ :



నాచారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఎలక్షన్ ఇంచార్జ్ TSEWIDC చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా ఏర్పాటు చేసిన నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల పరిచయ కార్యక్రమంలో డివిజన్ల వారీగా కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు అనుబంధ సంస్థల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎలక్షన్ ఇంచార్జి రావుల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తు, పార్టీ శ్రేణులంతా సమిష్టిగా గెలుపుకు కృషి చేయాలని నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి






వివిధ డివిజన్ ల నుండి కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలతో కలిసి బండారి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పార్టీ ఆదేశాల మేరకు శక్తివంచన లేకుండా కృషిచేసి గెలిపించుకుంటామని ఎలక్షన్ ఇంచార్జ్ రావుల శ్రీధర్ రెడ్డికి హామీ ఇచ్చారు. కేసీఆర్ ఆశీర్వాదంతో ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ సాధించిన లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ బీఆర్ఎస్ పార్టీ మూడోసారి మన రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని గంటాపదంగా చెప్తూ, బండారి లక్ష్మారెడ్డిని ఉప్పల్ నియోజకవర్గ ప్రజల సేవకై ప్రాంత అభివృద్ధికై అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని అసెంబ్లీకి పంపిస్తామని హామీ ఇస్తూ పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు అంతర్గత విభేదాలు ఏవైనా ఉన్నప్పటికీ పట్టించుకోకుండా నాయకులు కార్యకర్తల శక్తి సామర్థ్యాలు ఏకమై బండారి లక్ష్మారెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని దానికోసం కష్టపడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు ఏ సహాయం అవసరం ఉన్న, కష్టాలు ఉన్న నా నెంబర్ కు ఫోన్ చేసి చెప్పొచ్చని అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని నా యొక్క పర్సనల్ నంబరు ఇస్తున్నానని చెప్పి సభాముఖంగా కార్యకర్తలందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు శాంతి సాయిజన్ శేఖర్, బొంతు శ్రీదేవి యాదవ్, జేరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, బన్నాల గీతా ప్రవీణ్, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్ రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి, గొల్లురి అంజయ్య, గంధం జోష్నా నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, మేకల ముత్యం రెడ్డి, సుడుగు మహేందర్ రెడ్డి, దప్పు గిరిబాబు, ఎండీ ముస్తాక్, పల్లె నర్సింగరావు, పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎంగిలిపూల బతుకమ్మ పండుగ ఉత్సవాలలో పాల్గొన్న శేరిసవితా రెడ్డి

జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ, బోడుప్పల్ జంట కార్పొరేషన్ల పరిధిలో బతుకమ్మ పండుగ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ మేరకు శనివారం పీర్జాదిగూడ, బుద్ధనగర్ సాయిబాబా గుడి ముందు పార్కులో జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాల్లోమహిళలు ఉత్సాహంగాపాల్గొన్నారు.బతుకమ్మ ఉత్సవాలలోపాల్గొని మహిళా సోదరీమణులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు, బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు శేరి సరితా రెడ్డి.ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5 డివిజన్ పరిధిలో వివిధ కాలనీలో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ బతుకమ్మ సంబరాల్లో డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

జయభేరి, మేడిపల్లి

## స్వామివారిని దర్శించుకున్న బిఎల్ఆర్

జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ హెచ్ఎండిఏ భగాయిత్ నందు శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి దేవాలయంలో పెత్తర అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని హోమము, అభిషేకము, విశేష పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి విచ్చేసి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలలో ఆలయ కమిటీ సభ్యులు... కమ్మ లక్ష్మణ్, షామీర్పేట్ వినోద్ రెడ్డి, బొమ్మల సుధాకర్, షామీర్పేట్ రాకేష్ రెడ్డి, పుట్లూరి ఉపేందర్, బొట్టు వెంకటన్న, ఈగ సంతోష్ ముదిరాజ్, రమాకాంత్ రెడ్డి, భాష పల్లి నిరంజన్ చారి, మంద శేఖర్ ముదిరాజ్, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, రెడ్డి, సంజీవరెడ్డి, పెద్ద ఎత్తున ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది.







## పొన్నాలను బీఆర్ఎస్ లోకి ఆహ్వానించాం కేటీఆర్

జయభేరి, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించిన సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య తో సమావేశం అయ్యాను. కేసిఆర్ ఆదేశాలతో ఆయన్ని బీ ఆర్ ఎస్ లోకి ఆహ్వానించామని మంత్రి కేటీఆర్ అన్నారు. జనగామ సభలో చేరాలని చెప్పాం. కేసిఆర్ తో సమావేశమై తన నిర్ణయం చెబుతామని అన్నారు. ఆయన పార్టీలోకి వస్తె సముచిత స్థానం కల్పిస్తాం. కేకే, డీఎస్ లాంటి వాళ్లకు పార్టీలో పదవులు ఇచ్చింది గౌరవించాం. పెద్ద నాయకుడు, సీనియర్ నాయకుడు అ .చూడకుండా కాంగ్రెస్ పార్టీ అవమానంగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఎన్ని పార్టీలు మారలేదు. ఆయన పార్టీ లు మారొచ్చు కానీ ఇతరులు గౌరవం లేకపోతే మారొద్దా. దిగజారుడు సంస్కృతి మంచిది కాదు. సచ్చే ముందు పార్టీ మారటం ఏంటని మాట్లాడుతున్న నేతలు చిల్లరగా మాట్లాదుతున్నరు. ఓటుకు నోటు కు దొంగ ను పిసిసి కుర్చీ లో కూర్చోబెట్టారు. పొన్నాల కు మా పార్టీ న్యాయం చేస్తుందని అన్నారు.

## విజన్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు




జయభేరి, మేడిపల్లి :

విజన్ జూనియర్ డిగ్రీ కాలేజీలో ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈఉత్సవాలలో జూనియర్, డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ మేరకు పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం బుద్ధనగర్ రోడ్ నెంబర్ 8లో గల విజన్ జూనియర్, డిగ్రీ కాలేజ్ విద్యార్థినిలు కాలేజీ ముందు బతుకమ్మ ఆడి పాడారు. విజన్ కాలేజ్ డైరెక్టర్ సి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..... తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో భాగంగా బతుకమ్మ ఉత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నట్లుపేరొన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. దానయ్య, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రమాకాంత్, కాలేజ్ స్టాప్ వెంకట్, దుర్గాప్రసాద్, అనిల్, కృష్ణ, మహేష్, సత్యనారాయణ, అధిక సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు.

## చంద్రబాబుతో కాసాని భేటీ



జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14

తెలంగాణ ఎన్నికల్లో పోటీకి టీడీపీ సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు ఇప్పటికే టీడీపీ ప్రకటించగా.. అభ్యర్థుల ఎంపికపై కూడా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ ఎన్నికలపై చర్చించేందుకు ఇవాళ మధ్యాహ్నం రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబుతో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ములాఖత్ అయ్యారు. చంద్రబాబు కుటుంబసభ్యులు నారా లోకేష్, నారా భువనేశ్వరి, బ్రాహ్మణితో పాటు కాసాని కూడా చంద్రబాబును కలిశారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీపై చంద్రబాబుతో కాసాని చర్చించారు.తెలంగాణలోని రాజకీయ పరిస్థితులు, టీడీపీ కార్యాచరణను చంద్రబాబుకు కాసాని వివరించినట్లు తెలుస్తోంది. అభ్యర్థుల ఖారారు, ఎన్నికల వ్యూహంపై చంద్రబాబుతో మాట్లాడినట్లు సమాచారం. అలాగే తెలంగాణలో కూడా టీడీపీ, జనసేన పొత్తుపై చర్చించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో కూడా టీడీపీజనసేన పొత్తు ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. దీనిని టీడీపీ, జనసేన నేతలెవ్వరూ ఖండించకపోగా.. పొత్తు ఉంటుందని సమర్థిస్తున్నారు. రాష్ట్రంలో కూడా టీడీపీ జనసేన పొత్తు ఉంటుందని, త్వరలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో సమావేశమవుతామని ఇటీవల కాసాని మీడియాకు వివరించారు. దీంతో తెలంగాణలో కూడా పొత్తు ఖాయమని తెలుస్తోంది.తెలంగాణలో 30 స్థానాల్లో పోటీకి దిగబోతున్నట్లు ఇప్పటికే పవన్ ప్రకటించారు. పొత్తులో భాగంగానే పవన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు. తెలంగాణలో రెండు పార్టీల పొత్తు వల్ల సెటిలర్ల ఓట్లు చీలవని టీడీపీ, జనసేన అభిప్రాయపడుతుంది. దీని వల్ల ఎంతో కోంత లాభం ఉంటుందని భావిస్తున్నాయి. చంద్రబాబుతో పొత్తుపై కాసాని చర్చించగా.. రేపో, మాపో పూర్తి క్లారిటీ వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం చంద్రబాబుతో ములాఖత్ కొనసాగుతోంది. ముగిసిన తర్వాత లోకేష్, భువనేశ్వరి మీడియాతో మాట్లాడే అవకాశాలు కనిపిస్తున్నాయి.అటు చంద్రబాబు ఆరోగ్యంపై కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబుకు ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు రాజమండ్రి ప్రభుత్వ వైద్యులు ఒక రిపోర్ట్‌ను జైలు అధికారులకు అందించినట్లు తెలుస్తోంది. చంద్రబాబు చర్మ సంబంధిత సమస్యలతో పాటు డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు నివేదికలో పేర్కొన్నారు. చర్మంపై దద్దుర్లు వచ్చినట్లు తెలిపారు. అయితే చంద్రబాబుకు హైపర్ ట్రోఫిక్ కార్డియోమయోపతి సమస్య ఉందని, ఈ సమస్య వల్ల డీహైడ్రేషన్‌తో గుండెపైనా ప్రభావం పడే అవకాశముందని వ్యక్తిగత వైద్యులు చెబుతున్నారు. జైలు అధికారుల మాత్రం అంతా బాగుందని చెబుతున్నారని, అధికారులు చెప్పిన దానికి భిన్నంగా వైద్యుల నివేదిక ఉందని వ్యక్తిగత వైద్యులు అంటున్నారు.

ఇక చంద్రబాబు ఆరోగ్య సమస్యలను చిన్నవిచేసి అధికారులు చూపిస్తున్నారని ఆయన కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తాజా నివేదికతో చంద్రబాబు ఆరోగ్యంపై కుటుంబసభ్యులు, శ్రేణుల్లో మరింత ఆందోళన పెరిగిందని అంటున్నారు. చంద్రబాబుకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని డిమాండ్ చేస్తోన్నారు. దీంతో చంద్రబాబును రాజమండ్రిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు జైలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం జీజీహెచ్ ఆస్పత్రిలో ప్రత్యేక వీవీఐపీ రూమ్‌ను కూడా సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం రాత్రి గదిని శుభ్రం చేసినట్లు చెబుతున్నారు. రేపో, మాపో బాబును ఆస్పత్రికి తరలించే అవకాశముంనది అంటున్నారు.

# అభివృద్ధి నిరంతరం జరగాలంటే మళ్లీ బీఆర్ఎస్ రావాలి

## - సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో మల్లారెడ్డి

జయభేరి, మేడిపల్లి :

రాష్ట్రంలోని ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుభిక్షంగా, సంతోషంగా జీవిస్తున్నారని మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి తెలిపారు. శనివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని బొమ్మక్ బాలయ్య ఫంక్షన్ హాల్ లో బోడుప్పల్,పీర్జాదిగూడ కార్పొరేషన్ల సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఏర్పటు చేసి 20సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనాన్ని బోడుప్పల్ జోన్ అధ్యక్షులు జెనిగ హరియాదవ్ ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా మల్లారెడ్డి, నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కార్మికులను అన్నివిదాలుగా ఆదుకొని కార్మిక భీమ అందించామని అన్నారు.కష్టపడితే భవిష్యత్తు పూలబాటగ ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదని దాంతో పని కోసం వలసలతో ప్రజలు పక్క రాష్ట్రాలకు క్యూకట్టేవారని అలాంటిది నేడు పక్క రాష్ట్రాల నుండి మన రాష్ట్రానికి క్యూ కడుతున్నారని ఇదంత కేసీఆర్ పాలన చలవేనని కొనియాడారు. ఒకవేల కాంగ్రెస్ కు ఓటెస్తే దానిని మోరిలో వేసినట్టేనని, అభివృద్ధి నిరంతరం జరగాలంటే మళ్లీ కేసీఆర్ సీఎం కావాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ చైర్మన్ పరషురాం రెడ్డి,బోడుప్పల్ డిప్యూటి మేయర్ కొత్త లక్ష్మీరవి గౌడ్, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెట్టి, ప్రదాన కార్యదర్శి మీసాల క్రిష్ణ, నాయకులు బొమ్మక్ బాలయ్య, గుర్రాల వెంకటేష్ యాదవ్, రాసాల మహేష్, యాదగిరి, కార్యదర్శి వీరాస్వామి, కోటేష్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






jayabheridaily.com
ప్రభాత జయభేరి

# మంత్రి ఎర్రబెల్లి బతుకమ్మ శుభాకాంక్షలు

జయభేరి, హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక, ప్రకృతి పండుగ బతుకమ్మ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణ ఆడపడుచులకు మంత్రి ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు బతుకమ్మ పండుగ ప్రతీక. ప్రకృతి ఒడిలో పూచే పువ్వుల పండుగ. పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ. ప్రభుత్వమే ప్రజల పండుగలను నిర్వహించే గొప్ప సంస్కృతిని సీఎం కెసిఆర్ ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ముఖ్యమైన పండుగలకు ప్రజలకు కానుకలు ఇచ్చి పండుగలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో జరుపుకునే ఈ గొప్ప పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికి బతుకమ్మ పండగ శుభాకాంక్షలని అన్నారు.

# ప్రవల్లికది సర్కార్ హత్య

జయభేరి, హైదరాబాద్

ఉద్యోగాలు లేక ప్రవల్లిక లాంటి అమ్మాయి ఉరి వేసుకొని బలవన్మరనానికి పాల్పడుతుంటే, కేసీఆర్ ను చూసి ఓటెయ్యండని ఎలా అడుగుతున్నారు కేటీఆరని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల ప్రశ్నించారు. ఉద్యోగం సాధించి వస్తానమ్మా అని పట్నం వెళ్లిన బిడ్డ విగతజీవిగా వస్తే, ఆ తల్లిదండ్రుల గుండె కోత ఎలా ఉంటుందో తెలుసా మీకు? ప్రవల్లికది ఆత్మహత్య కాదు.. మీ సర్కార్ చేసిన హత్య. నష్ట జాతకురాలు ప్రవల్లిక కాదు. అన్ని అధికారాలున్నా నిరుద్యోగుల కోసం ఏం చేయలేని పాలకులు నష్ట జాతకులు. ఉద్యోగాలకు సకాలంలో నోటిఫికేషన్లు ఇవ్వడం చేతకాలేదు. ఒక్క పరీక్ష కూడా సక్రమంగా నిర్వహించడం చేతకాలేదు. ఏం చూసి మిమ్మల్ని మళ్లీ ఎన్నుకోవాలి? ఇంటికో ఉద్యోగం అని చెప్పి మోసం చేసినందుకా. నిరుద్యోగ భృతి అని దొంగ హామీ ఇచ్చినందుకా. అంగట్లో సరుకుల్లా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లు అమ్ముకున్నందుకా. పేపర్ లీకులు, పరీక్ష వాయిదాలు, కేసులు, కోర్టులు.. మీ పాలనలో నిరుద్యోగుల దుస్థితి ఇది. గద్దెనెక్కిన నాటి నుంచి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఉద్యోగం లేక ప్రాణాలు తీసుకుంటున్న చెట్టంత బిడ్డలని కోల్పోతున్న ఆ తల్లిదండ్రుల ఉసురు మీకు, మీ సర్కార్ కు తగలక మానదని ఆమె అన్నారు.

# మంత్రి వేములను పరామర్శించిన ఎమ్మెల్యేలు

జయభేరి, వేల్పూర్

రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా..శనివారం నాడు ఆయన్ను నిజామాబాద్ జిల్లా వేల్పూర్ లోని వారి నివాసంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న,జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ముదోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టూరిజం ఎం.డి మనోహర్,వరంగల్ ఎలెక్ట్రిసిటి డైరెక్టర్ మోహన్ రెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. మంత్రి,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వేముల తండ్రి దివంగత రైతు నాయకుడు వేముల సురేందర్ రెడ్డి తో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



# ఎక్కడా కరెంట్ కోత లేదు

## కేంద్ర మత్రి కిషన్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో నిర్వహించిన రైతు సదస్సులో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు వచ్చాయి. వ్యవసాయ, పారిశ్రామిక, ఉత్పత్తి, విదేవీ విధానం, దేశంలో మౌలిక వసుతుల కల్పన లాంటి అనేక అంశాల్లో గత తొమ్మిదేండ్లుగా జరిగిన అభివృద్ధిని మనం గుర్తుకు తెచ్చుకోవాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షా 20 వేల కోట్ల రూపాయలు తెలంగాణలో రహదారుల కోసం వెచ్చించారని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో గతంలో కరెంట్ కొరత ఉండేది.. ఇప్పుడు ఏ రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవు. వ్యవసాయ, పారిశ్రామీకరణ రంగాలకు సరిపోను కరెంట్ ఈ దేశంలో ఉన్నది. విద్యుత్ కోతలు లేని దేశాన్ని మోదీ ఆవిష్కరించారు. మన రాష్ట్రంలో రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించి ప్రధాని మోదీ స్వయంగా ప్రారంభించారు. ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు ప్రధాని మోదీ రామగుండం వస్తే.. మన ముఖ్యమంత్రి ఫామ్హౌజ్లో ఉన్నారు. మోదీ ఎన్టీపీసీ ప్రాజెక్టును ప్రారంభించేందుకు వస్తే.. కేసీఆర్ ప్రగతిభవన్లో ఉన్నారని అన్నారు. కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ సుప్రీంకు వెళ్లింది. కేసు విత్ డ్రా చేసుకోమని కేంద్రం చెబితే.. ఏండ్ల తరబడి జాప్యం చేసింది కేసీఆర్ మాత్రమే. ఆయన కారణంగానే కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరిగిందని వెల్లడించారు. కేంద్రం ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం నిందలు వేయడమే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుంది. పంటల బీమా అమలు చేస్తుందని అయన అన్నారు.

# సోషల్ మీడియా లో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్మిన్లదే బాధ్యత

జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 14

రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో సోషల్ మీడియాపై రాష్ట్ర పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సోషల్ మీడియా ఖాతాలైన వాట్సాప్, ఫేస్‌బు క్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో పెట్టే పోస్టులు, చేసే కామెంట్లపై నెటిజన్లు, ఆయా గ్రూపుల సభ్యులు జాగ్రత్తలు వహించాలి.ఆయా గ్రూపుల్లో పార్టీలను, అభ్యర్థులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, పోస్టు పెట్టడం, ఫొటో ఎడిట్ చేయడం, వాయిస్ మెసేజ్‌లు పెట్టడం తక్షణమే మానుకోవాలని సూచించారు. ఆయా గ్రూపుల్లో తమకు వ్యతిరేకంగా వచ్చిన పోస్టుల ఆధారంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. తప్పనిసరిగా అడ్మిన్, ఆ పోస్టు చేసిన వ్యక్తిని విచారించి, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# నిరుద్యోగ విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్య

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

జయభేరి, మేడ్చల్ :

నిరుద్యోగ విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఆరోపించారు. శనివారం సంతోష్ విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్ టు పరీక్ష వాయిదా పడిందని మనస్థాపానికి గురై హైదరాబాద్ నగరంలోని అశోక్ నగర్ లో ప్రైవేటు బాలికల హాస్టల్ లో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన నిరుద్యోగ విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యని ఆయన మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సర కాలంలో ఇది 8వ నిరుద్యోగుల ఆత్మహత్య సరైన ప్రణాళిక లేకుండా రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ వ్యవహరిస్తుందని రాథోడ్ సంతోష్ స్పష్టం చేశారు. నిరుద్యోగులకు పరీక్ష నిర్వహణలో లోపభూయిష్టంగా ఉందని దానికి తోడు పారదర్శకంగా నిర్వహించకపోవడం లాంటివి జరుగుతుంటే మళ్ళీ



సమయాన్ని పొడిగించడంపై పేద నిరుద్యోగులపై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నిరుపేద నిరుద్యోగులు కోచింగ్ కేంద్రాలకు లక్ష రూపాయలు చెల్లించి వసతి గృహాలలో వేలాది రూపాయలు చెల్లిస్తూ చదువుకుంటున్నారని రాథోడ్ సంతోష్ వెల్లడించారు.నిరుపేద నిరుద్యోగులు ఇబ్బందులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అధికారం కోసం ఇస్తున్న ప్రాధాన్యత కనీసం విద్యార్థి నిరుద్యోగులకు భరోసా కల్పించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన పొన్నాల లక్ష్మయ్య ఇంటికి వస్తానని చెప్పిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నిరుద్యోగ విద్యార్థిని ప్రవల్లిక మృతి చెందితే ఆమె కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లే ఓపిక లేదానని ఆయన ప్రశ్నించారు.ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి ప్రవల్లిక కు న్యాయం చేసి ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ వచ్చేస్తుందని రాథోడ్ సంతోష్ తెలియజేశారు.నిరుద్యోగ విద్యార్థులపై పెట్టిన పోలీస్ కేసులను ఎత్తివేయాలని నిరుద్యోగులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ నిలుస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ హెచ్చరించారు.

# పూల పండుగకు వేళాయే..

## ఎంగిలి పులాతో మొదలైన బతుకమ్మ పండుగ.. సంబరాల్లో ఆడపడుచులు..

జయభేరి, మేడ్చల్ :

దైవాన్ని పూలతో పూజిస్తాం కానీ పూలనే దైవంగా భావించి ఆరాధించే వేడుక బతుకమ్మ పండుగ.పెత్రమాస రోజు మొదలయ్యే ఎంగిలి పువ్వుల బతుకమ్మ చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది.ఎంగిలి పులా బతుకమ్మ పండుగ సందర్భంగా మేడ్చల్ మండలం,మున్సిపాలిటీలలో వాడ వాడాలో మహిళలు,యువతులు తీరొక్క పూలతో బతుకమ్మను తీర్చిదిద్ది 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయె చందమామ.. వంటి సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ బతుకమ్మలను చుట్టూ చప్పట్లు చారుస్తూ వలయంలా తిరుగుతూ సందడి చేశారు.అడబిడ్డలు సంబరంగా జరుపుకునే బతుకమ్మ పండుగను చిన్న పెద్ద తేడాలేకుండా ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం,బంధుత్వం, ఆప్యాయతలు,భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తూ సంబురంలో మునిగిపోయారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగను అధికారికంగా జరిపిస్తుండటంతో బతుకమ్మ వేడుకకు





ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పెరిగింది.తొమ్మిది రోజులు జరులుకునే ఈ పండుగలో బతుకమ్మను రోజుకో పేరుతో పిలిస్తూ ఆడిపడటంలో ఆడపడుచులకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.

# పోలీస్ తనిఖీలలో భారీగా పట్టుబడ్డ నగదు

జయభేరి, మేడ్చల్ :

తెలంగాణాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.ఈ నేపద్యంలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీలలో భారీగా నగదు పట్టుపడిందాని సిఐ నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం సిఐ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలలో భాగంగా ఎలాంటి ఆధార పత్రాలు లేకుండా రూ.59 లక్షల 9 వేల రూపాయల నగదుతో పాటు 18 తులాల బంగారం పట్టు పడిందని ఆయన చెప్పారు.ఈ మేరకు పట్టుబడ్డ రూపాయలను స్క్రీనింగ్ కమిటీకి అప్పగించామని ఆధార పత్రాలు ఉన్నవారు స్క్రీనింగ్ కమిటీకి చూపినట్లయితే విచారణ అనంతరం తిరిగి డబ్బులు ఇచ్చే




అవకాశం ఉందని సీఐ నర్సింహారెడ్డి వెల్లడించారు.ఇప్పటికైనా వాహనాలలో ప్రయాణించే వ్యక్తులు రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లవదని ఎక్కువ నగదు అవసరం ఉన్నట్లయితే వాటికి సంబంధించిన ఆధార పత్రాలను వెంబడి తీసుకొని రావాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎస్సైలు నవీన్ రెడ్డి,శంకర్ గౌడ్,ఏఎస్ఐ లు,కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

# ప్రవల్లిక ఆత్మహత్య బాధాకరం

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14

హైదరాబాద్ లో గ్రూప్ 2 అభ్యర్థిని ప్రవళిక ఆత్మహత్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఆమె ఆత్మహత్య బాధాకరమని, ఏ తల్లిదండ్రులకు ఇలాంటి పరిస్థితి రాకూడదని అన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ విమర్శలపై కవిత తీవ్రంగా స్పందించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆవేదన బూటకమని, కాంగ్రెస్ పార్టీ ఆందోళన నాటకం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను కవిత తిప్పికొట్టారు.ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా ఖండించారు. 'మేము బతుకమ్మ చేస్తాం.. బాధను కూడా పంచుకుంటాం.' అని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కించపరచడం ఒక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని ధ్వజమెత్తారు. ఓ ఆడబిడ్డ ఆత్మహత్య చేసుకుంటే సానుభూతి వ్యక్తం చేయడం పోయి రాజకీయం చేయడమే కాంగ్రెస్ విధానమా.? అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్లకు మోకాలడ్డుతూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నది కాంగ్రెస్ పార్టీ కాదా.? అని ఆమె నిలదీశారు. తెలంగాణలో ఏ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ జారీ అయినా దాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేసింది వాస్తవం కాదా.? అని పేర్కొన్నారు. గ్రూప్ 2 వాయిదా వేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీధర్ బాబు అసెంబ్లీలో



డిమాండ్ చేశారని, రేవంత్ రెడ్డి సైతం ట్విట్టర్ (X) వేదికగా డిమాండ్ కోరారని గుర్తు చేశారు. ప్రవళిక ఆత్మహత్యపై రేవంత్ రెడ్డి ఆవేదన బూటకమని, కాంగ్రెస్ ఆందోళన నాటకమని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శవాల మీద పేలాలు ఏరుకోవడం కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి హత్య చేసిన వారే ఓదారుస్తున్నట్లుందని ధ్వజమెత్తారు. అంతకు ముందు ప్రవళిక ఆత్మహత్యపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, 'బతుకమ్మ సంబరాలపై వీడియోలు పెట్టే MLC కవితకు, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ అవకతవకలతో బతుకు భారమై, భవిత ఆగమై ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక ఆత్మ ఘోష వినపడడం లేదా.?' అంటూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'ఆడబిడ్డల హక్కులు మీ దృష్టిలో రాజకీయ అంగడి సరుకు, రాజకీయ నినాదాలు తప్ప మానవీయ ఎజెండాలు కాదు' అని ట్వీట్ లో ధ్వజమెత్తారు. వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక (23) అశోక్ నగర్ లోని ఓ హాస్టల్ లో ఉంటూ గ్రూప్ 2కు సన్నద్ధమవుతోంది. శుక్రవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, గ్రూప్ 2 పరీక్ష వాయిదాతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ వందలాది మంది నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ అంశంపై రాజకీయంగానూ వివాదం రేగుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు.



# బహుమతులను గెలుచుకోవాలి

## ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత

జయభేరి, మేడిపల్లి :

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి నగదు 1 బహుమతులను గెలుచుకోవాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఈనెల 21 నుండి 23 వరకు, 28 నుండి 30 వరకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించిన 5గురు మహిళలు, 5గురు పురుషులకు రూ. 9900 ల నగదు బహుమతులను అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఈనెల 15 నుండి 29 వరకు తిరుగు ప్రయాణానికి టికెట్ బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం పూర్తికాగానే టికెట్ వెనకాల ఆధార్ పై ఉన్న పూర్తి పేరు, ఫోన్ నెంబర్ రాసి ఆర్టీసీ బస్టాండ్ లలోని లక్కీ డ్రా బాక్స్ లో వెయ్యాలని సూచించారు. లక్కిడిప్ ద్వారా గెలుపొందిన ప్రయాణికులకు రూ. 9900 చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. ముందస్తు రిజర్వేషన్ కొరకు www.tsrtc.in వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించారు.

# బీఆర్ఎస్ కార్పోరేటర్ పీయే ఇంట్లో డ్రగ్స్ స్వాధీనం

జయభేరి, హైదరాబాద్

బోరబండ బీ అర్ ఎస్ కార్పొరేటర్ పీఏ ఇంట్లో డ్రగ్స్ దాడులు కలకలంరేపాయి. కృష్ణా నగర్ లో నార్కోటిక్స్ అధికారుల దాడులు నిర్వహించారు. మహ్మద్ ఇస్మాయిల్ అలియాస్ చోర్ అబ్బు ఇంట్లో అరు గ్రాముల కొకైన్ స్వాదీనం చేసుకున్నారు. ప్రస్తుతం బోరబండ కార్పొరేటర్ వద్ద పీఏ గా చోర్ అబ్బు పనిచేస్తున్నాడు. నార్కోటిక్స్, ఎక్సైజ్ అధికారులు నమోదు చేసారు. గతంలో చొర్ అబ్బూ మీద ఎస్ అర్ నగర్ సీఎస్ లో పలు చోరీ కేసులు, బెట్టింగ్ కేసులు నమోదయినట్లు సమాచారం.

# ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్

## డ్రైవర్ చాకచక్యం లో ప్రయాణికులుక్షేమం

జయభేరి, హైదరాబాద్

బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా ప్రయాణికుల ప్రాణాలకు ముక్కు వాటిల్లకుండా బస్సును అదుపు చేసి ప్రయాణికులను క్షేమంగా రోడ్డు పక్కకు చేర్చాడు. ఈ సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీఆర్ పార్కు దగ్గర కోటి నుండి పటాన్చెరువు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిలయ్యాయి. డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. ప్రయాణికులెవరికి హాని కలకుండా పార్కు సైడు ఉన్న ఫుట్ పాత్ పైకెక్కించి బస్సును ఆపాడు. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో బస్సులో సుమారుగా 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు బస్సు డ్రైవర్ వెంకటేష్ గౌడ్ తెలిపాడు. ఎవరికి గాయాలు కాకుండా ప్రాణహాని లేకుండా బస్సు ను నడిపినందుకు డ్రైవర్ వెంకటేష్ గౌడ్ సమయస్ఫూర్తిని పలువురు ప్రయాణికులు అభినందించారు.

# బతుకమ్మ పండుగ

## ఆడబిడ్డలందరికీ ఎమ్మెల్సీ కవిత

# శుభాకాంక్షలు

జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 14

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ఘనంగా జరుపుకొనే పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. మన ఆడబిడ్డల ఆత్మీయ సంగమం, తెలంగాణ ఆత్మగౌరవ సంబరం బతుకమ్మ అన్నారు. ఈ నేపథ్యంలో భారత జాగృతి రూపొందించిన బతుకమ్మ పాటల ఆల్బమ్‌ను కవిత విడుదల చేశారు. మొత్తం 10 పాటలున్న ఈ ఆల్బన్ యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఇందులో ఒక పాటకు ఎమ్మెల్సీ కవిత కోరస్ ఇవ్వడం విశేషం.

# జయభేరి సినిమా



## విజయ్ దేవరకొండతో నటించాలనేది తన కోరిక

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్... డైరెక్టర్ మారుతి కాంబోలో తెర
కెక్కుతున్న కొత్త ప్రాజెక్టులో నటిస్తోంది హీరోయిన్ మాళవిక
మోహనన్. ఇటీవల ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన యాక్షన్
సీన్ వీడియోస్ నెట్టింట చక్కర్లు కొట్టాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ
లండన్ లో సందడి చేస్తుంది. ఇక అక్కడి నుంచి నిత్యం లేటేస్ట్
ఫోటోస్ ఇన్ స్టా వేదికగా అభిమానులతో పంచుకుంటుంది.
అయితే ఇటీవల బ్లాక్ అండ్ బ్లాక్ అవుట్ ఫిట్ లో విదేశీ వీధుల్లో
ఫోటోషూట్ చేసింది మాళవిక. ఇందుకు సంబంధించిన ఫోటోస్
నెట్టింట పంచుకోగా.. తెగ వైరలయ్యాయి. తమిళంలో రజినీకాం
త్ నటించిన పెట్ట సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది మాళవిక. ఆ
తర్వాత మారన్, తంగాలన్ చిత్రాల్లో నటించింది. తమిళంతోపా
టు తెలుగులోనూ పలు చిత్రాల్లో నటించి అలరించింది. ఓవైపు
సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న నెట్టింట మాత్రం నిత్యం ఏదోక పోస్ట్
చేస్తూనే ఉంటుంది. ఇక తెలుగులో విజయ్ దేవరకొండతో నటిం
చాలనేది తన కోరిక అంటూ గతంలో చెప్పుకొచ్చింది మాళవిక.
రొమాంటిక్ లేదా కామెడీ సినిమా చేయాలని ఉందని తెలిపింది.
ప్రస్తుతం ఈ బ్యూటీ ప్రభాస్ జోడిగా రాజా డీలక్స్ సినిమాలో
నటిస్తుంది. ఈ సినిమా ఇప్పుడు షూటింగ్ వేగంగా జరుపుకుం
టుంది. లేటేస్ట్ సమాచారం ప్రకారం ఈ మూవీ హరర్ జోనర్ లో
ఉండబోతుందని తెలుస్తోంది. రాజా డీలక్స్ తర్వాత తెలుగులో
మరిన్ని అవకాశాలు అందుకోనున్నట్లు తెలుస్తోంది.



## ఆస్కార్ రేసులో మిషన్ రాణిగంజ్

అక్షయ్ కుమార్ ఫ్లాపుల పరంపరను 'మిషన్ రాణిగంజ్' కంటిన్యూ చేస్తుంది. వారం కిందట రిలీజైన ఈ సినిమాకు పాజిటీవ్ రివ్యూలే వచ్చాయి. కానీ కలెక్షన్‌లు మాత్రం అట్టడుకు వెళ్లాయి. తొలిరోజు కేవలం కోటికి పైగా షేర్‌ను మాత్రమే రాబట్టి.. అక్షయ్ కుమార్ కెరీర్‌లో లోయెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలిచింది. ఇప్పటివరకు ఈ సినిమా పట్టుమని పది కోట్ల షేర్‌ను కూడా సాధించలేకపోయింది. అయితే కమర్షియల్‌గా ఈ సినిమా పెద్దగా ప్రభావం చూపలేకపోయినా.. క్రిటిక్స్ నుంచి గొప్ప ప్రశంసలు దక్కించుకుంది.
కాగా చిత్ర యూనిట్ ఈ సినిమాను ఆస్కార్ పోటీకి సిద్ధం చేసింది. జనరల్ కేటగిరీలో ఇండిపెండెంట్‌గా ఆస్కార్ కోసం నామినేషన్ వేసింది. పశ్చిమ బెంగాల్‌లోని బొగ్గు గనిలో వరదలు వచ్చినప్పుడు జస్వంత్ సింగ్ గిల్ అనే ఒక ఇంజనీర్ 65 మంది కార్మికులను రక్షించాడు. ఆయన నిజ జీవిత కథ ఆధారంగా ఈ సినిమాను టిను సురేశ్ దేశాయ్ తరకెక్కించాడు. కథ పరంగా.. ఎగ్జక్యూషన్ పరంగా ఈ సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి. మరీ ఆస్కార్ బిరిలో ఏ మేరకు మెప్పుపొందుతుందో చూడాలి.
ఇక ఇండియా తరుపున మలయాళ సినిమా 2018 ఆస్కార్‌కు అధికారికంగా ఎంపికైంది. ఈ ఏడాది మే నెల తొలివారంలో రిలీజైన ఈ సినిమా అక్కడ రూ.150 కోట్ల మార్క్ టచ్ చేసి మలయాళ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. 2018లో కేరళలో వచ్చిన వరదల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. ఆర్మీలో ఉద్యోగం మానేసి దుబాయ్ వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న టోవినో థామస్. ప్రజల కష్టాలను ప్రపంచానికి చూపించే జర్నలిస్ట్ అపర్ణ బాలమురళి. ఓ పెద్ద మోడల్ కావడమే లక్ష్యంగా శ్రమిస్తున్న మత్స్యకార కుటుంబానికి చెందిన అసీఫ్ అలీ.
ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే కుంచకో బొబన్. కేరళ సరిహద్దుల్లో ఉండే తమిళనాడు గ్రామానికి చెందిన లారి డ్రైవర్ కలైయారస్ టూరిస్ట్‌లకి గైడ్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్న అజు వర్ఘీస్. ఇలా ఎవరి జీవితాల్లో వారు వారి పనుల్లో బిజీగా ఉంటారు. అలా జీవితాన్ని కొనసాగిస్తున్న వీళ్ల లైఫ్‌లోకి అనూహ్యమైన పరిణామం చోటుచేసుకుంటుంది. అదే కేరళ వరదలు. ఆ సమయంలో ఒకరికొకరు ఎలా అండగా నిలబడ్డారు. వరదల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడారు అనే కథాంశంతో ఈసినిమా తెరకెక్కింది.

## మీరా జాస్మిన్.. హాట్ షో తో సెగలు

మీరా జాస్మిన్.. ఈ పేరుకు ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. ఎందుకంటే ఒకప్పుడు తెలుగు ఇండస్ట్రీలో వరుస సినిమాలు చేసింది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా బాలకృష్ణ, పవన్ కళ్యాణ్, రవితేజ లాంటి స్టార్ హీరోలతో నటించింది మీరా జాస్మిన్. ఎక్స్ పోజింగ్ కు దూరంగా ఉంటూ వీలైనంత వరకు ఫ్యామిలీ ఓరియెంటెడ్ క్యారెక్టర్స్ చేసింది ఈ భామ. అయితే సినిమాల నుంచి దూరం అయిపోయిన తర్వాత ఇప్పుడు రెచ్చిపోతుంది.అది కూడా అలా ఇలా కాదు.. ఏకంగా నేటి జనరేషన్ హీరోయిన్లు కూడా పరేషాన్ అయ్యేలా అందాల ఆరబోతలో దూసుకుపోతుంది మీరా. 40ల్లోకి ఎంటర్ అయిన తర్వాత ఉన్నట్టుండి హాట్ షోకు తెరతీసింది మీరా జాస్మిన్. అసలు ఈమెలో ఈ రేంజ్ మార్పు ఎందుకు వచ్చింది అని అభిమానులు కూడా షాక్ అవుతున్నారు. హీరోయిన్ గా సినిమాలు చేస్తున్నప్పుడు మాత్రం హోమ్లిగా కనిపించి.. రిటైర్ అయిన తర్వాత రెచ్చిపోతుండడానికి అసలు కారణం ఏంటబ్బా అని అందరూ పరేషాన్ అవుతున్నారు. దానికి మెయిన్ రీజన్ ఇంకోటి ఉంది అని తెలుస్తోంది. మీరా ప్రస్తుతం తెలుగు కంటే మిగిలిన భాషలపై ఎక్కువగా ఫోకస్ చేసింది. మరీ ముఖ్యంగా తన సొంత ఇండస్ట్రీ అయిన మలయాళంలో వరస సినిమాలు చేస్తుంది. కాకపోతే ఇక్కడ మరో విషయం కూడా గమనించాలి.. ఈమె కేవలం బయట మాత్రమే గ్లామర్ షో చేస్తుంది.. సినిమాల్లోకి వచ్చేసరికి చాలా పద్ధతిగా కనిపిస్తోంది మీరా. ఈ లెక్కలు ఏంటో ఎవరికి అర్థం కావడం లేదు. సినిమాల్లో హోమ్లీ క్యారెక్టర్స్ చేస్తూ.. బయట మాత్రం రెచ్చిపోవడం వెనక అసలు అర్థం ఏంటబ్బా అని ఆరా తీస్తున్నారు నెటిజన్లు. దీనికి ఒకటే కారణంగా కనిపిస్తుంది. మ్యాగజైన్స్ కవర్ పేజీల పైన ఇలా గ్లామర్ షో చేస్తే ఊహించని డబ్బులు వస్తాయి.. సినిమాలు చేసినా కూడా రాని రెమ్యూనరేషన్ కేవలం ఫోటోషూట్స్ కు ఇస్తుంటారు వాళ్ళు. అందులోనూ ఇప్పటి వరకు గ్లామర్ షో చేయకుండా ఉన్న మీరా జాస్మిన్ లాంటి సీనియర్ హీరోయిన్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈమె ఈ రేంజ్ లో రెచ్చిపోవడానికి బహుశా ఇది ఒక కారణం అయ్యి ఉండొచ్చు. మరొకటి అవకాశాల కోసం..! ఈమెకు కొందరు దర్శకుల నుంచి ఆఫర్స్ వచ్చినట్టు తెలుస్తుంది.





## భగవంత్ కేసరి తెలంగాణ యాస ఎందుకు పెట్టారో తెలుసా ?

నందమూరి బాలకృష్ణ భగవంత్ కేసరి సినిమా అక్టోబర్ 19న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు వున్నాయి. బాలకృష్ణని సరికొత్తగా ప్రజెంట్ చేయడం, యాక్షన్ సీక్వెన్స్ లు సహజంగా వుండటం, శ్రీలీల కూతురి పాత్రలో కనిపించడం, తెలంగాణ యాస లో బాలయ్య చెప్పే డైలాగులు.. ఇవన్నీ సినిమాపైఆసక్తిని పెంచాయి. అయితే ఈ సినిమాలో బాలకృష్ణ తెలంగాణ యాస మాట్లాడటానికి గల ప్రత్యేకమైన కారణం చెప్పారు దర్శకుడు అనిల్ రావిపూడి. ''తెలంగాణ యాసలో ముక్కుసూటి తనం వుంటుంది. బాలకృష్ణ గారి వ్యక్తిత్వం దానికి దగ్గరగా వుంటుంది. ఇది ఆయన మీద చేస్తే బాగా వర్క్ అవుట్ అవుతుందని బలంగా నమ్మాను. అది బాగా వర్క్ అవుట్ అయ్యింది. ఇందులో చాలా డైలాగ్స్ ఆయన నేచర్ కి దగ్గరగా వుంటాయి. డైలాగ్స్ బోల్డ్ గా వుంటాయి. డైలాగ్స్ థియేటర్స్ లో పేలుతాయి'' అని చెప్పుకొచ్చారు అనిల్ రావిపూడి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com